AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

18-4-2026 (Saturday) MAIN EDITION

## బీజేపీ అధ్యక్షుడి హౌస్ అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పార్లమెంట్లో బిల్లులు వీగిపోయిన క్రమంలో బీజేపీ.. నేడు దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ ఇంటి ఎదుట నిరసన, ఆందోళనలు చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తార్నాకలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు బీజేపీ నాయకులు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాంచందర్ రావు మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు దక్కకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందని విమర్శించారు.

## బీజేపీ గెలిస్తే టీఎంసీ పని ఖతం : అస్సాం సీఎం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మమత బెనర్జీకి మోదీ అంటే భయం అన్నారు. బెంగాల్లో ఎప్పుడైనా బీజేపీ అధికారంలోకి వస్తే తన రాజకీయ జీవితం ముగిసిపోతుందని ఆమెకు బాగా తెలుసన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కాంగ్రెస్ పార్టీని శాశ్వతంగా పక్కన పెట్టేసినట్లే, ఇక్కడ కూడా బీజేపీ గెలిచిన వెంటనే, టీఎంసీ పని ఖతం అవుతుందన్నారు.

## నేడు ప్రధాని ప్రసంగం



**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధాన మంత్రి మోదీ శనివారం రాత్రి 8:30 గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులు లోక్‌సభలో వీగిపోయిన విషయం తెలిసిందే. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి బిల్లులు ఆమోదం పొందలేదు. ఈ క్రమంలో ప్రధాని ఏం మాట్లాడుతారోనని ఉత్కంఠ నెలకొంది.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




**అక్షరటుడే, మహబూబ్‌నగర్ :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్‌లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచవటి పాఠశాలలో మంత్రులు చిన్నారుల ట్రాఫిక్ అవగాహన పార్కును ప్రారంభించారు.

## పాన్ షాపుల్లో తనిఖీలు



**అక్షరటుడే, హైదరాబాద్:** పాతబస్తీలోని పాన్ షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థల దగ్గరలోని పాన్‌షాప్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్కూల్ పిల్లలకు టొబాకో పదార్థాలు అమ్ముతున్నారనే సమాచారంతో దాడులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు సిగరెట్లు, గుట్కాలు కొంటున్నట్లు గుర్తించారు.




## అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం వచ్చింది. శనివారం ఉదయం ఆ దేశంలోని పలు ప్రాంతాలు 5.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. అలాగే కాశ్మీర్ లోయలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజల భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సీస్మోలాజికల్ వివరాల ప్రకారం.. అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం ఉదయం 8:24 గంటల సమయంలో సంభవించింది. దీని కేంద్ర బిందువు బదఖ్షాన్ ప్రాంతంలోని జైబక్ సమీపంలో గుర్తించారు. భూమి ఉపరితలం నుంచి సుమారు 190 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉండడం వల్ల ఉపరితలంపై దాని ప్రభావం గణనీయంగా తగ్గింది.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**అక్షరటుడే, ఢిల్లీ :** కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజమండ్రివిశాఖ 3,4 రైల్వేలైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ప్రధాని గ్రామీణ సడక్ యోజన పథకాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించింది. భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కాకినాడ, మచిలీపట్నం, గంగవరం పోర్టులకు కనెక్టివిటీ కోసం రూ.9,889 కోట్లు కేటాయించింది. గోదావరిపై 4.3 కి.మీ మేర వంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.




# కేంద్ర ఉద్యోగులకు డీఏ పెంపు

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. డీఏ 2 శాతం పెంచింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఖర్చులు, ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీఏ పెంచుతుంది. జనవరి, జులైలో కరువు భత్యం పెంపు నిర్ణయం తీసుకుంటుంది. తాజాగా జనవరికి సంబంధించిన డీఏను పెంచింది.

■ 2 శాతం పెంపునకు మంత్రివర్గం ఆమోదం ■ జనవరి నుంచి అమలులోకి.. ■ హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే కరువు భత్యం (డీఏ)ను 2 శాతం పెంచడానికి శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యాన్ని చివరిసారిగా అక్టోబర్‌లో సవరించారు. అప్పుడు దానిని 55 శాతం నుంచి 58 శాతానికి పెంచారు. ఈ పెంపును జూలై 1, 2025 నుండి అమలులోకి తెచ్చారు. ఆ తర్వాత దీనిని బకాయిలతో కలిపి అమలు చేశారు. తాజాగా మరో రెండు శాతం డీఏ పెరిగింది. దీంతో 60శాతానికి పెరిగింది.

### ఉద్యోగులకు ప్రయోజనం

డీఏ పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరింది. సవరించిన ఈ డీఏ జనవరి 2026 నుంచి అమల్లోకి వస్తుంది. ఇది పెన్షనర్లకు కూడా వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కోటి మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి జరగ నుంది. రూ. 30 వేల మూల వేతనం కలిగిన ఒక ఉద్యోగికి ఈ సవరణ ఫలితంగా నెలకు రూ.600 అదనంగా లభిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతన ప్యాకేజీలో డీఏ కీలక భాగం. ముఖ్యంగా రాబోయే వేతన సంఘం గురించి చర్చలు జరుగుతున్న తరుణంలో డీఏ పెరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## గుంట నక్కల్లో దడ మొదలైంది : కేటీఆర్



**అక్షరటుడే, జగిత్యాల :** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు శనివారం జగిత్యాలలో పర్యటించారు. కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. సింహం బయటికి వస్తుందంటే గుంట నక్కల గుండెల్లో దడ పుడుతుందన్నారు. కేసీఆర్ జగిత్యాలలో సభ పెడతానంటే ఆ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ పోయేందుకు రెండేళ్లుగా రేవంత్ రెడ్డికి సమయం లేదు కానీ కేసీఆర్ సభ పెట్టిన రోజే వెళ్తున్నారన్నారు. జగిత్యాలకు వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తులేదు కానీ ఈరోజే తవ్విస్తున్నారని విమర్శించారు. ఇంత చిల్లర ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా ఉండరని సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపించిందని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు సభలో ఉండి ఉంటే.. తెలంగాణ ఏర్పాటును ఇండియా, పాకిస్తాన్ విభజనతో పోలుస్తూ.. మాట్లాడిన తేజస్వికి తెలంగాణ బిడ్డల తరపున దీటైన సమాధానం చెప్పేవాళ్లమన్నారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా మౌనంగా కూర్చున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి తేజస్వి సూర్యను వెనకేసుకొస్తున్నారని విమర్శించారు.

## విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత



**అక్షరటుడే, మెదక్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్య , వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట శనివారం ఆయన పర్యటించారు. పాలిటెక్నిక్ కాలేజీలో సుమారు రూ.75 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జోగిపేట పాలిటెక్నిక్ కాలేజీకి ఇప్పటివరకు రూ.2. 35 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు.


## పార్టీ ఫండ్ నొక్కేసిన బీజేపీ ఇన్‌ఛార్జి!

**అక్షరటుడే, జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ ఫండ్‌ను ఇన్‌ఛార్జి భోగ శ్రావణి నొక్కేశారని కౌన్సిలర్ అభ్యర్థులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరిగిన విషయం తెలిసిందే. తాజాగా జగిత్యాల బీజేపీ ఇన్‌ఛార్జి భోగ శ్రావణిపై కౌన్సిలర్ అభ్యర్థులు ఆరోపణలు చేయడం గమనార్హం. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన బీజేపీ అభ్యర్థులు శనివారం పార్టీ ఆఫీసులో ఆందోళన చేపట్టారు. పార్టీ ఫండ్ విషయంలో భోగ శ్రావణి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. 50 వార్డులకు గాను 46 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తే.. ఒక్కొక్కరికి రూ.2,15,000 రావాల్సి ఉండగా మొత్తం ఇవ్వలేదన్నారు. కొందరికి రూ.50 వేలు, మరికొందరికి రూ.లక్ష మాత్రమే భోగ శ్రావణి ఇచ్చారని, మిగతావి ఆమె నొక్కేశారని ఆరోపించారు.



## ఐటీ రంగంలో సంక్షోభం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 80 వేల మంది ఉద్యోగాలు కోల్పోగా, ఖర్చుల తగ్గింపు, ఏఐ ప్రభావం ప్రధాన కారణాలుగా గుర్తించారు. ప్రపంచ ఐటీ రంగం మరోసారి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. కరోనా తర్వాత కొంత కాలం స్థిరంగా కనిపించిన ఉద్యోగ పరిస్థితి, ఇప్పుడు మళ్లీ లేఆఫ్స్ రూపంలో దెబ్బతింటోంది. తాజా నివేదికల ప్రకారం, ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు 80 వేల మంది టెక్ ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. 2021 నుంచి ఇప్పటివరకు మొత్తం 10 లక్షల మందికి పైగా లేఆఫ్స్‌కు గురైనట్లు వెల్లడైంది.




## ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ ఉక్కుపాదం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్‌లు ఆక్రమణలకు గురి అయ్యాయి. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్ పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో చాలా వరకు ఫుట్ పాత్‌లు ఆక్రమణకు గురి అయ్యాయి. వాటిపై పాన్ డబ్బాలు పెట్టుకొని వేలాది మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. పెద్ద పెద్ద హోటళ్లు, సంస్థలు, షాపింగ్ మాళ్లు సైతం ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తున్నాయి. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగిస్తున్నారు. పాదచారుల భద్రతను మెరుగుపరిచేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగరంలోని 6 జోన్‌లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఫుట్ పాత్‌లను ఆక్రమించి నిర్మించిన వందలాది శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను తొలగించింది. జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. అధికారులు ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ రద్దీ ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తున్నారు.

## మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్న రష్మిక



పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు కొన్ని రోజులు ఎంజాయ్ చేశారు. అనంతరం మళ్లీ షూటింగ్‌లలో బిజీ అయిపోయారు. ప్రస్తుతం రష్మిక మైసా సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కోసం ఆమె బ్యాంకాక్ వెళ్లింది. అక్కడ జైకా స్టంట్ టీమ్‌తో కలిసి రోజుకు 8 గంటలు మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తోంది.

- అక్షరటుడే, సినిమాడెస్క్